# 'సిగ్గ'ంటే షేమే....

"డాడీ! వాటీజ్ ది మీనింగ్ ఆఫ్ షిగ్గూ.... టెల్మీ డాడీ! మా మాటెల్గూ మేడం సెవరల్ టైమ్సుయూజ్ ఛేస్తారీ వర్డ్ని". ఆంగ్ల మాధ్యమంలో ఆరో తరగతి చదూతున్న కొడుకు..... తండ్రి అవధానిని ప్రశ్నించాడు. అవధాని బుర్ర గోక్కుని అక్కడే పేపర్లో ఉన్న విషయం చూసి "మన స్పీకర్ గారున్నారా? పార్లమెంట్‌లో సీట్లో కూర్చోనిటానికి సిగ్గు పడుతున్నానని. అదే సిగ్గంటే..."

"స్పీకర్ సీట్లో కూర్చోటానికి సిగ్గెందుకట. ఓహో! అంత మంది ఎదట కూర్చో




లేకపోవటమా సిగ్గంటే?" అనేసి వెళ్ళిపోయాడు.

'హమ్మయ్య' అని ఊపిరి పీల్చుకున్నాడేగానీ.... 'వాడు మళ్ళీ ఆ ప్రశ్న వేస్తే ఏం చెప్పాలి?' అని ఆలోచిస్తున్నాడు అవధాని.

ఓ తెలుగు ఛానల్లో వీక్షకులు కోరుకున్న సినిమా బిట్స్‌ను ప్రజెంట్ చేస్తోంది యాంకరు. మాయాబజార్‌లో పెళ్ళికూతురుగా 'సావిత్రి' సిగ్గుపడుతూ కనిపించింది. 'ఇదే' సిగ్గంటే' అని చెప్పాలనుకుంటున్నంతలో ఆ సీన్ అయిపోయింది. మరో కొత్త సినిమాలో బిట్. ఆది కొత్త పెళ్ళికూతురు శోభనపు గదిలో కొత్త పెళ్ళికొడుక్కు పాలగ్లాసు అందిస్తున్న దృశ్యం. పెళ్ళికొడుకు తలదించుకు నిలబడ్డాడు. పెళ్ళికూతురు గ్లాసులోని పాలు తాగేసి, 'పెళ్ళి కూతురు నేనా? మీరా? మీకు సిగ్గెందుకు?" అని గ్లాసక్కడ పెట్టేసింది. అరటి పువ్వునకు డొప్పలు తీసి పడేసినట్లు వలువలు ఊడ్చిపడేసింది అతన్నల్లుకుపోతూ.

'నయం! పొరపాటున 'సావిత్రిని సిగ్గుకు అర్థంగా చెప్పి ఉంటే పప్పులో కాలేసినట్లయేది' అని నాలుక కరుచుకున్నాడు అవధాని.

నెహ్రూ పంచశీల సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన తరువాతనే చైనా భారత్‌పై దాడి చేసింది. తన సిద్ధాంతానికి గండిపడట

మేగాక-తన దేశభూభాగం కూడా నష్టపోవలసి వచ్చినందుకు నెహ్రూ సిగ్గుతో పార్లమెంట్లో తల దించుకోవాల్సివచ్చిందట. లాల్ బహదూర్ శాస్త్రీజీ రైల్వే మంత్రిగా ఉన్నప్పుడు రైలు ప్రమాదం జరగ్గా అందుకు బాధ్యత వహిస్తూ-తన మంత్రిపదవికి రాజీనామా చేశారట. 'సిగ్గంటే అదన్నమాట' అందామనుకున్నాడు.

అయితే అవధాని కొడుకు చురకత్తి లాటివాడు.

'ఇటీవల బోల్డు రైలు ప్రమాదాలు జరిగాయిగా. మరి రైల్వే మంత్రి రాజీనామ చెయ్యలేదే? అలాగే చమురు కుంభకోణంలో ఓ కేంద్ర మంత్రిగారూ, బి.జె.పి. అధ్యక్ష పదవి నుంచి ఓ పెద్దాయనా, తె.రా.స. పదవి నుంచి మరొకాయన మాకు మీరొద్దుగాక వద్దన్నా రాజీనామ చెయ్యలేదు, మరి వాళ్ళకి సిగ్గూ....' అని అడిగాడే అనుకుందాం, అప్పుడు అవధాని ఏం చెప్పగలడు?

అందుకే గుటకలు మింగేశాడు.

ప్రకాశం పంతులుగారి మీద అవిశ్వాసం పెట్టినప్పుడు ఒక్కరిని బతిమలాడితే ఆయన పదవిలో కొనసాగేవాడట. కానీ ఆయన ఆ పని చెయ్యలేదు. అలాగ బతిమలాడ్డానికి ఆయన సిగ్గుపడ్డాడన్నమాట. అని చెప్పాలనుకుంటే 'మరి ఈరోజుల్లో పదవి నిలబెట్టుకోడానికి సిద్ధాంతాలు నచ్చక పోయినా-పదవుల పంపకాలు జరిగితే చాలా?' అని కొడుకు అడుగుతాడేమోనని అవధాని బైటపళ్లేదు.

ఆ వెంటనే దేశద్రోహ నేరంలో ఇరుక్కున్న ఒక మాజీ సినీనటిని కోర్టుకు తరలిస్తున్న దృశ్యం టీవీలో కనిపించింది. అప్పుడామె ముఖం నిండా ముసుగేసుకుంది. 'అదే సిగ్గంటే' అని చెప్పబోయి- 'ఇప్పుడైతే ఆమె ముఖానికి ముసుగేసుకుందిగానీ- ఆమె ముఖం అందరికీ తెలిసిందే కదా? అని కొడుకు అడిగితే?

ఆత్మాభిమానంగల దుర్యోధనుడు మయసభలో తొట్రుపాటుపడితే ద్రౌపది నవ్విందని వధ్యశిల మీద తల పెట్టుకుని ఆత్మహత్యకు సిద్ధపడ్డాడు. అదీ సిగ్గంటే అని చెప్పబోయి- ఇవాళ ఒక పార్టీలో ఉన్నవాళ్ళు ఇంకో పార్టీని నోటికొచ్చిన తిట్లు తిట్టి మళ్ళీ ఎన్నికల్లో ఆ పార్టీ అధికారినికొస్తే అందులో చేరిపోతారే? అని కొడుకు ప్రశ్నిస్తే ఏం సమాధానం చెప్పగలడు?

సిగ్గంటే ఏమిటి? అదెలా ఉంటుంది? అదెక్కడుంటుంది? అని రెట్టించి అడుగుతున్న పుత్రరత్నానికి "నాన్నా! పూర్వం 'హంస'లని ఉండేవి. ఇంచుమించు ఇప్పుడొపిస్తున్న బాతుల్లాగా. ఇప్పుడు హంసల్లేవుగా. అలాగే ఒకప్పుడు ఈ దేశంలో 'సిగ్గు' అనేది ఒకటి ఉండేది. ఇప్పుడది హంసలాగే ఎగిరిపోయింది" అని చెప్పాలనుకుంటున్నంతలో పక్కవాళ్ళ బ్బాయి లాగేసుకోకుండా రావటం చూసి, అవధాని కొడుకు చప్పట్లు కొడుతూ "షేమ్....షేమ్... లాగేసుకోకుండా వచ్చేశాడు" అన్నాడు. ఆంగ్ల మాధ్యమంలో చదువుతున్న కొడుక్కి 'సిగ్గు' అనే తెలుగు పదం తెలీదుగానీ - దాని భావం తెలుసని గ్రహించి - ఇంట్లో కూడా తెలుగు సరిగ్గా మాటాడ్డం నేర్పలేనందుకు సిగ్గు పడుతూ 'సిగ్గంటే షేమేరా!' అన్నాడు కొడుకుతో.